అందులోంచి అంతడబ్బూ తుపరమయిపోయిందండీ. ప్రక్కని నాకోటు పెట్టుకుంటే అదీ మాయమయింది.''

కన్నయ్య తల తిరిగిపోయింది. నెమ్మదిగా వెనక్కివచ్చి సందులో పడిపోసాగాడు. ఐతే తనకి చిక్కిందెవరు? ఆ దొంగ వెధవేనా? ఎంత నాటకమాడాడు?

తనలో ఎవరో వెయ్యిగొంతుకలతో "తెలివి తక్కువ కన్నయ్య" అని ఒకటే పనిగా అరుస్తున్నారు.

కథానిక

ఫలహారంమీద ప్రీతి

సత్యమూర్తి

ఆ ఊళ్ళో పెద్ద దేవాలయం ఉంది. పెద్దదే కాదు పేరుగలది కూడాను. పంచారామాలలో ఒకటి. విశాలమైన ప్రాకారాలు, కోనేరు, వీటినన్నిటినీ మించి అద్భుతమైన తెల్లటి పొడుగాటి శివలింగం ఆ గుడిలో ఆకర్షణీయమైన దృశ్యం. ఇంత ఘనత గలిగినదైనా ఒక్కలోటు కనబడుతూనే ఉంటుంది. ఆమహా దేవాలయం గ్రామంలో లేదు. గ్రామానికి దూరాన అంటే అరమైలు ఎడంగా విశాల ప్రదేశంలో నిర్మింపబడివుంది. తలనెరిసిన పెద్ద వాళ్ళంటారు, "గ్రామం ఆ గుడి చుట్టూరా ఉండేదట. రైలూ, కాలువ వచ్చిన తర్వాత కొత్తగా యిక్కడ కట్టుకున్నారు ఇళ్లు" అని. ఇంతకూ చెప్పొచ్చేదేమిటంటే ఎంతదూరమైనా కొందరు భక్తులు ప్రతిరోజూ కోనేరులో స్నానంజేసి గుడిగంటలు మ్రోగిస్తూనే ఉంటారు. కాని కార్తీక మాసం, మాఘ మాసాలలో గుడిగంటలు ఎక్కువసార్లు మ్రోగుతుంటాయి. ఆ గంటల మ్రోత సాధించే ఫలితం మాట ఎలావున్నా గంటల చప్పుడు విని ఊరిమొగదల యిండ్లున్న పిల్లలు జట్లుజట్లుగా గుడివైపు పరుగులెడతారు. కొబ్బరి ముక్కలు, అరటి పండ్లు యీ బాల భక్తులను ఆహ్వానిస్తూ వుంటాయి. ఆ కొబ్బరి ముక్కలు, అరటి పండ్ల కొరకు పిల్లలు ఆరాట పడడం యీ నాటిది కాదు. కాటికి కాళ్ళు చాచుకు కూర్చున్న ముసలివాళ్లు కూడా గంట మ్రోతవిని "మా చిన్నతనంలో గంట టంగుమనేప్పటికి చెంగున గెంతువేసి గుడిలో ప్రవేశించే వాళ్ళం" అని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటారు.

ప్రకాశం కలిగున్న వాళ్ళబిడ్డ. అయినంత మాత్రాన కొబ్బరి ముక్కలు, అరటి పండ్లు ప్రకాశాన్ని ఆహ్వానించలేవని కాదు. ఆశకు కులభేదాలు అర్థభేదాలు వుండవు. చిన్నతనంలో బాల్యచేష్టలు అనే పేరిట ఒక వ్యక్తి వ్యక్తిత్వం ఆకారాన్ని సృష్టించుకొంటుంది. అట్లాంటి భావిస్వభావ సూచనలు ప్రకాశంలోనూ చూడొచ్చు.

ప్రకాశానికి మాఘ శనివారం పూర్తిగా సెలవురోజు. మాఘ శనివారంనాడు గుడిలో భక్తుల సంఖ్య హెచ్చుతుంది. దాంతో కొబ్బరి ముక్కలు, అరటి పండ్లు గుట్టలు పడతాయి. ఆ రోజంతా ఊరి పిల్లలు దేవాలయ ప్రాంగణంలోనే ఉంటారు. ప్రకాశం రాత్రి పడుకుంటూనే అనుకున్నాడు. "రేపు తెల్లవారఝామునే లేచి ముందుగా ప్రయాణమై గుడికి పోతే కావలసినంత ఫలహారం తెచ్చుకోవచ్చు. ఏమాత్రం ఆలస్యమైనా శనివారం సెలవు మూలాన్ని ఆడపిల్లలు, మగాళ్లు అంతా జట్లు జట్లుగా వచ్చేస్తారు. అప్పుడుఫలహారం కాకెంగిలి చేస్తేనేగాని పంచుకతినడానికి వలనుపడదు. నేను లేచేప్పటికి ఒక్క ముసలి తాత మాత్రం మూలుగుతూ మెలకువగా ఉంటాడు. నే లేచినట్లు పసికట్టినా "ఎక్కడికిరా వెడుతున్నావు పుస్తకం తెచ్చుకొని చదువుకోరాదూ"

అంటాడు. ఇక కోతిపుండు బ్రహ్మరాక్షసి అవుతుంది. అమ్మా నాన్నా అంతా తెలుసుకుంటారు. నా ప్రయాణం ఆగిపోతుంది. చప్పుడు చేయకుండా లేచి బయటికి పోవాలి. లేదా తాతయ్య పలుకరిస్తే దొడ్లోకి వెడుతున్నానని వంకబెట్టి మెల్లగా చల్లగా జారుకోవాలి. చలి జోరుగా వుంటుంది. ఉదయం దుప్పటి పట్టుకెడితే నాన్న వచ్చిన తర్వాత తిడతారు. ఎంత జాగ్రత్తగా వున్నా ఏ అరటిపండు కర్రో, ముఖ్యంగా పనిబూని అయితీరుతుంది. ఇది కనిపెట్టి అమ్మ నాన్నతో పుల్ల నోడించి చెబుతుంది. దాంతో నా వీపు బ్రద్దలౌతుంది. అంచేత దుప్పటి మానేసి తాతయ్య అంగవస్త్రం చెవులకు కట్టుకుంటే మంచిది. చలికాలం ప్రొద్దుటే కాళ్ళకు రాళ్ళు ముళ్ళు గుచ్చుకున్నట్లు గుచ్చుకుంటాయి. నాన్న కొన్న జోడు వేసుకవెడితే మంచిదే కాని గుడిలో మరచిపోతానేమోనని భయం. పైగా పూజారాయన చూశాడంటే "గుడిలోకి జోళ్ళు తెచ్చావురా?" అని తడిచేత్తో గుద్దుతాడు. ఈ బాధ భరించడం మహాకష్టం. అందుకని జోడు పట్టుకెళ్ళడమే మానెయ్యనా? ఆఁ! ఎందుకు? మా మేనత్తకొడుకు వీర్రాజున్నాడు కదూ, వాడి జోడు పట్టుకెళ్లడం మంచిది. వాడు చూస్తే మంచివాడు కాదుగాని తెల్లవారందే ప్రయాణం గనుక వాడి కండ్లలో కారం కొట్టొచ్చు. జోడు మరచిపోయినా, మాయమయిపోయినా అంత యిబ్బందుండదు. ఇంటి ప్రక్క మహాలక్ష్మమ్మగారు సాయంత్రం కొడుకు చేత పెద్ద అత్తలం అరటిపండ్లు తెప్పించింది. అవన్నీ దేవునికేనట. ఆవిడ లేచినప్పుడు లేచి కూడా బయలుదేరాలి. మహాలక్ష్మమ్మగారి పిల్లాడు నాతోటివాడే "రాము" చచ్చిపోయి సంవత్సరమైంది. "రాము" పేరుజెప్పి కనీసం ఐదుపండ్లయి నాముందు నాకు పెట్టకపోతుందా." అని ఆలోచించుకొని ప్రకాశం ప్రకృతి నిశ్శబ్దాన్ని భరించలేక చలేస్తూంటే దుప్పటితో ముసుగుపెట్టి ప్రయత్న పూర్వకంగా నిద్రపోయాడు.

రాత్రి కార్యక్రమం నిర్ణయించుకొంటూ చాలసేపు మెలకువగావున్న మూలాన్ని ప్రకాశం మేలుకొనేప్పటికి తెల్లటి వెలుగు వచ్చింది. కంగారుగా లేచి ఆవులించబోయాడు. కాని చప్పుడు తాతకు వినిపిస్తుందేమోనని మానేశాడు. మెల్లగా లేచి చల్లగా అవతలకు జారుకున్నాడుగాని ఒక్క అసంతృప్తి మాత్రం ప్రకాశాన్ని వేధిస్తోంది. ప్రకాశం పినతల్లి కొడుకు చిట్టిబాబు, మేనత్తకొడుకు వీర్రాజు ఒక్క మంచంమీదే పరున్నారు. వీర్రాజు పొట్టి వేదాంతి. వాణ్ణి తనకూడా గుడికి తీసుకు వెళ్ళడం ప్రకాశానికి యిష్టంలేదు. ఇక చిట్టిబాబు చాలా మంచివాడు. వాళ్ల ఊరువెడితే ప్రకాశానికి "ఐస్‌ఫ్రూటులు" కొనిపెడతాడు. ఎక్కడకు వెళితే అక్కడకు కూడా తీసుకవెడతాడు. చిట్టిబాబును మెల్లిగా లేపి తనతో తీసుకవెళ్ళాలని బుద్ధిపుట్టింది. అందుకోసరమని ప్రకాశం మళ్లీ యింట్లోకి వెళ్ళాడు. తన యత్నం ఫలించేట్టు లేదు. వీర్రాజు బద్ధకం విరుచుకొంటూ మంచంమీద కదులుతున్నాడు. ఇది చూచి ప్రకాశం పరుగున వీధిలో కొచ్చేశాడు.

ప్రకాశం గుడికి బయలుదేరేటప్పటికి కొందరు మగాళ్ళు తడిబట్టలతో తిరిగివస్తున్నారు. ఇక ప్రకాశం గునుపు పరుగుపెట్టి ముందుకు సాగిపోయాడు. గుడికి సమీపంలో చింతచెట్టు క్రింద ఓవిగ్రహముంది. ఆవిగ్రహంవంక ఎవరూ చూడరుగాని మాఘ మాసంలోనూ, కార్తీక మాసంలోనూ యీ విగ్రహానికి కూడా అరటిపండు ముక్కలు నోట్లో ఉంటాయి. ప్రకాశం యీ విగ్రహం దాపునుండే వెళ్ళేడుకాని ఆ అరటిపండు ముక్కలతన్ని ఆహ్వానించ లేకపోయినై. దానికి కారణాలు చాలా వున్నై. ప్రకాశం యింకా ముఖం కడుక్కోలేదు. పైగా మహాలక్ష్మమ్మ పెద్ద అత్తలం అరటిపండ్లు పట్టుకొని ముందు వెడుతూంది. అలాంటప్పుడు ఈ ముక్కలకోసరం కక్కుర్తిపడమని ఎక్కడుంది? అందుకని ప్రకాశం గబగబా గుళ్ళో ప్రవేశించాడు. అడంగుల్లో అత్తలం అరటిపండ్లు తెచ్చింది మహాలక్ష్మమ్మ ఒక్కర్తే. అందుకని ప్రకాశం ఆమెకూడానే ఉంటూవచ్చాడు. ఆవిడ ప్రకాశాన్ని చూసిందికాని పలుకరించలేదు. అయినా తనతో మాట్లాడుతున్నట్లు పైవాళ్ళు చూస్తే ప్రకాశం మహాలక్ష్మమ్మకు

సన్నిహితుడని తలంచడానికి వీలుగా దాపునే ఉంటున్నాడు ప్రకాశం.

మహాలక్ష్మమ్మ మొహం కడుక్కోడానికని కోనేరు వైపుకు వెళ్లింది. ప్రకాశం కూడా గుడిలో మామిడి పుల్లొకటి విరుచుకొని ముఖం కడుక్కోడానికి ఉద్యుక్తుడయ్యాడు. "ఏమబ్బాయి యిలా వచ్చావు ప్రొద్దున్నేను?" అని కదలేసింది మహాలక్ష్మమ్మ ప్రకాశంవంక చూస్తూ. "మాఘ శనివారం సెలవుకదాండి" అన్నాడు ప్రకాశం అభినయిస్తూ.

"అవునుగాని ప్రకాశం, నిన్న మీ మేనత్త కొడుకు వీర్రాజు ఏమిటి బరువుగా మోసుక వస్తున్నాడు?"

"ఏమీ లేదండీ, నిన్న నేకదూ వాడు వాళ్ల ఊరినుంచి వచ్చేడు? వచ్చేటప్పుడు చెఱుకు ముక్కలు పట్టుకొచ్చాడండి."

"మరేమీ లేదులే, ఏమిటో అని అడిగేను అంతే"

"మీకు, సుబ్బమ్మగారికి రెండేసి ముక్కలు యిద్దామన్నది మా అమ్మ. మా నాయనమ్మ ససేమిరా అంది. రాత్రి భోజనాలయ్యాక నేను, మా అమ్మ, నాన్న, చెల్లి ఒక్కొక్కముక్క తీసుకొని తిన్నామండి. మిగిలినవన్నీ వీర్రాజు మా నాయనమ్మ అర్ధరాత్రి వరకూ తింటూనే ఉన్నారండి."

"ఈవాళే చూశావు నాయనా నువ్వు? ముసలావిడది పూర్వంనుంచీ యిలాంటి బుద్ధే. మీ అమ్మ కాపురాని కొచ్చిన కొత్తలో ఎన్ని బాధలు పెట్టేవనుకున్నావు? మంచి చెడ్డలు ప్రజలు చెప్పుకుంటారు నాయనా."

"ఈ పొట్టివాడు మాత్రం ఆగండుడండి."

"ఏ పొట్టివాడు?"

"నిన్నొచ్చిన వీర్రాజండి."

"వీర్రాజా! మంచిపేరే పెట్టేవు. మీ మామయ్య మరీ పొట్టి."

"నాకు మా నాన్న కొత్త చొక్కా కుట్టించేడనుకోండి. వీర్రాజు వచ్చాడా అంటే ఎలాగోలాగ క్రిందా మీదా బెట్టి మా నాయనమ్మతోటి, తాతయ్యతోటి చెప్పి ఆ చొక్కా కాజేసేవరకూ విడిచిపెట్టడు. నేనెప్పుడైనా వాళ్ళ ఊరు వెడితే చచ్చేట్టు పని జేయిస్తారు. ఇక్కడ వీర్రాజును దుకాణం మీదకు వెళ్ళమంటే మీ ప్రకాశం ఏమయ్యాడని మా అమ్మ మీదే ఎదురొంటాడు."

"వాళ్ళ చట్టమే అలాంటిది నాయనా! మీ తాత సంతానం మొత్తంలో మీ నాన్నగారొకరు తప్పితే అంతా అలాంటి సజ్జే... చూడు బాబూ! యీ చెంబుతో కొస్త నీళ్లు అందుకోందూ."

"అలాగేనండి. మా నాయనమ్మ ఏమంటుందో తెలుసునాండి? 'ఏదో మేనమామ యిల్లని చూడడానికి వస్తే వాడే దొరికేడా మీకు దుకాణాలమీదకు పంపించడానికి? వాడు రాకపోతే ఏంజేద్దురు? ఏదో మేమున్నన్నాళ్ళూ గాని తరవాత జేరేనివ్వరు' అని దొంగ దుఃఖాలు తెచ్చుకొంటుందండి."

ఇంతలో పౌరోహితుడు జంజం సవరించుకొంటూ "స్నానం జేయించా లేమిటమ్మా" అన్నాడు మహాలక్ష్మమ్మవంక జూస్తూ. మహాలక్ష్మమ్మ నోట్లో నీరు పుక్కిలిస్తోన్న మూలాన్ని ఔనన్నట్లు బుర్రవూపింది. "గబగబా కానివ్వాలమ్మా" అంటూ అందుకున్నాడు బ్రాహ్మడు.

స్నానం కొస్తా పూర్తయింది. తల విడారిప్పుకొని మెట్లెక్కడం ప్రారంభించింది మహాలక్ష్మమ్మ. ఇంతకుముందే లోపల కూర్చున్న ప్రకాశం ఈవిణ్ణి చూచి ఎవరో అనుకున్నాడు గాని నిలకడమీద ఆనవాలు పట్టి చేతిలో అత్తలం జూచి చిరునవ్వు నవ్వేడు. గుడిలో మూలవిరాట్టు శివలింగమైనా చుట్టురా వందల కొలది చిన్న చిన్న విగ్రహాలున్నై. ప్రతిరోజూ వచ్చిపోయే భక్తులు యీ విగ్రహాలన్నింటినీ పూజించరుగాని మాఘమాసంలోనూ, కార్తీక మాసంలోనూ సంవత్సరానికి రెండుసార్లు వచ్చే ఆడంగులు ముఖ్యంగా పూజిస్తూంటారు. మహాలక్ష్మమ్మ అత్తలం పట్టుకొని ముందు బాలా త్రిపురసుందరిని దర్శించి పళ్లెంలో డబ్బాపళ్ళూ పెట్టింది. పూజారినడిగి కొస్త కుంకం కూడా పుచ్చుకొంది. పూజారికి తెలియక ప్రకాశంమీద కూడా శఠగోపం పెడుతూంటే మా పిల్లాడు కాడు అంది మహాలక్ష్మమ్మ నిర్మొహమాటంగా. ప్రకాశానికి మండుకొచ్చింది గాని "శఠగోపం నాకెందుకు? అరటిపండ్లు

ముఖ్యం గాని" అని సర్దిచెప్పకొని సంతోషించాడు. ఇక మహాలక్ష్మమ్మగారి వడిలో అరటిపండ్లు వేసుకొని వరుసగా విఘ్నేశ్వరుడికి, సూర్యనారాయణమూర్తికి, సప్తమహర్షులకు, సరస్వతీదేవికి ... నమస్కరించి ఒకొక్క పండు చిదిమి పెట్టడం ప్రారంభించింది. పై విగ్రహాల దగ్గర పూజారి ఉండడు. అందుకని యీ విగ్రహాలకు ఎవరైనా కొంత అరటిపండు ముక్క చిదిమి రాస్తూ ఉంటారు. మొట్టమొదట ప్రకాశం ఆ చిదిమిన ముక్కలు తీసుకుందామనుకున్నాడు గాని మళ్ళీ ఎందుకు యింకా అరటిపండ్లు చాలా ఉన్నాయి కదా అని ఆతృత చల్లార్చుకొన్నాడు. సరస్వతీదేవి దగ్గరకు వెళ్ళినపుడు "తల్లీ నిన్ను తలంచి..." అని లోపల ప్రార్థించాడు. ఇలా రామలింగేశ్వరస్వామి, కుమారస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి .. అంతా అయిపోయారు. ఇక మహాలక్ష్మమ్మ దగ్గర అరటిపండ్లు అయిపోవచ్చినై. ప్రకాశానికి ఆతృత ఎక్కువైంది. ఎటూ పాలుపోక తొట్రుపడుతున్నాడు. ఎండెక్కిపోతోంది. వాళ్ళనాన్న యీపాటికి యింటికి వచ్చేస్తాడు. అందుకని ప్రకాశం కంగారు పడుతున్నాడు. మహాలక్ష్మమ్మగారు శనేశ్వరస్వామి విగ్రహం సమీపించి అరటిపండు చిదిమి ఆయనకు కూడా కొంత రాసింది. ఓ నమస్కారం బెట్టి ముందుకు సాగిపోయింది. ప్రకాశం ఉండబట్టలేక శనేశ్వరునకు చిదిమి పెట్టిన అరటిపండుముక్క తీసి నోట్లో పెట్టుకోబోయాడు. నూనె, కుంకం అంటుకున్నాయి. గాబోలు నోరు అదోలా అయిపోయి ఆముదం తాగినవాడిలా తుపుక్కున ఉమ్మి వేశాడు. ఇదెక్కడ జూశాడో పూజారి "గుళ్ళో ఊస్తావురా" అని పెద్ద కేకబెట్టేడు. ప్రకాశం గబగబా చొక్కాతో మూతి తుడుచుకొని అవతలకు పారిపోయాడు.

"మా నాయనమ్మ కంటే మహాలక్ష్మమ్మ మంచిదిలా తీపికబుర్లు చెప్పింది ముందు. మా నాయనమ్మే నయం. ఏదైనా తింటూన్నప్పుడు దగ్గరుంటే కొద్దో గొప్పో రాల్చుతుంది. అందుకే యిలాంటిది మూలాన్నే నా తోటివాడు "రాము" చచ్చేడు. పోనీ వాడి పేరు చెప్పి ఒక్కపండైనా బెట్టిందా? మొట్టమొదటే పూజారాయన శఠగోపం నెత్తిమీద బెట్టుతూంటే తనదేదో పడిపోయినట్టు "మాపిల్లాడు కాద"ని తిప్పుకుంది. అప్పుడైనా యింటికి పోయానుకాను. ఇపాటికి మా నాన్న వస్తారు. ఏమంటారో! మొన్న హరికథ దాసుగారు చెప్పేరు చిన్నపిల్లలు భగవంతునితో సమానమని. నన్ను ఎదురుగుండా బెట్టుకొని దేవుడికి పెడితే మాత్రం ఈవిడకు పుణ్యం వస్తుందా?" అనుకుంటూంటే ప్రకాశం మేనత్త కొడుకు వీర్రాజు ఎదురయ్యాడు, "ప్రొద్దుటే ఎవరినీ లేపకుండా పోయావు బాగా తిన్నావా?" అంటూ.

వాషింగ్టన్, సెప్టెంబరు 19–ఆమెరికా చతుర్థసూత్ర ప్రణాళిక క్రింద విదేశాలకు సాంకేతిక సహాయ కార్యక్రమ సందర్భంలో, అమెరికాలో శిక్షణ ముగించుకొన్న 14 మంది సాంకేతిక నిపుణులు దూరప్రాచ్యంలోని 5 దేశాలకు వెళ్ళనున్నారని అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఆ దేశాల ప్రజల ఆచారాలు, భాష, కట్టుబాట్లు మొదలైన విషయాలలో వారికి అమెరికాలో మూడు వారాలపాటు శిక్షణ ఇచ్చారు. వారి వెంట వస్తున్న వారి భార్యలకుకూడ ఆ శిక్షణ ఇచ్చారు. ఆ పధ్నాలుగుమందిలోను ఇరాన్‌కు 7 గురు, లైబీరియాకు 4 గురు, ఇండియా, సింహళం, లెబనాన్ దేశాలకు ఒక్కొక్కరు వెళ్ళనున్నారు.

ఇండియాకు వెళ్ళనున్న డాక్టర్ హారి హైమన్ అమెరికా కార్మికశాఖలో పనిచేస్తున్నారు. ఇండియాలోని కార్మికుల ఆరోగ్యం విషయమై ఆయన కృషి చేస్తారు. ఆయన అమెరికా ప్రజారోగ్యశాఖలో లెఫ్టినెంట్ కర్నల్ హోదాలో ఉన్నారు. ఆయనతో ఆయన సతీమణికూడ ఇండియాకు వెళ్ళనున్నది.